www.netifocusnews.com


నేటి ఫోకస్ న్యూస్

అను నిత్యం...ప్రజా పక్షం...

తెలుగు డిజిటల్ దినపత్రిక

మంగళవారం 11, నవంబర్ 2025 | వెల: రూ.4/- | సంపుటి: 01 | సంచిక: 40 | పేజీలు: 04

Published From: Hyderabad | Editor: Mankali Tharun



ప్రముఖ కవి, వాగ్గేయకారుడు

# అందెశ్రీ కన్నుమూత

- లాలాపేటలోని తన నివాసంలో గుండెపోటుతో హఠాన్మరణం
- హుటాహుటిన గాంధీ ఆస్పత్రికి తరలింపు.. అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరణ
- భౌతికకాయం సందర్శనకు తరలివచ్చిన నాయకులు, ప్రముఖులు
- నేడు ప్రభుత్వ అధికార లాంఛనాలతో అంత్యక్రియలు
- హాజరుకానున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పలువురు మంత్రులు, ఎంఎల్‌ఏలు
- అందెశ్రీ మరణవార్తకు దిగ్భ్రాంతికి గురైన సాహితీ లోకం
- ప్రధాని నరేంద్ర మోడీ, సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎంఎల్‌ఏలు సహా బిఆర్ఎస్ అధినేత కెసిఆర్, ఆ పార్టీ నాయకులు కెటిఆర్, హరీశ్‌రావు సహా ముఖ్య నాయకుల దిగ్భ్రాంతి

హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్)-నవంబరు 10:

ప్రముఖ కవి, వాగ్గేయకారుడు, తెలంగాణ రాష్ట్ర గీతాన్ని సృజించిన అందెశ్రీ (64) ఇకలేరు. హైదరాబాద్ లాలాపేటలోని తన నివాసంలో సోమవారం ఉదయం గుండెపోటుతో ఆయన హఠాన్మరణం చెందారు. ఇంట్లోనే ఉదయం 7 గంటల ప్రాంతంలో ఆయన ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. కుటుంబ సభ్యులు వెంటనే ఆయనను చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో హుటాహుటిన గాంధీ ఆస్పత్రికి తరలించారు. అయితే, అప్పటికే ఆయన తుదిశ్వాస విడిచినట్లు వైద్యులు ప్రకటించారు. ఆయనకు భార్య, కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఆయన అంత్యక్రియలను అధికార లాంఛనాలతో నిర్వహించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. మిగతా 2లో..



# ఢిల్లీలో భారీ పేలుడు

## ఎర్రకోట సమీపంలో పేలిన కారు

**8 మంది మృతి**

**24 మందికి గాయాలు**

- క్షతగాత్రుల్లో ముగ్గురు పరిస్థితి విషమం
- ఛిద్రమైన శరీరభాగాలతో ఘటనాస్థలి వద్ద భీతావహ దృశ్యాలు
- పేలుడు ధాటికి తీవ్రంగా దెబ్బతిన్న పలు వాహనాలు, దుకాణాలు
- పేలుడు సమయంలో కారులో ఉన్న ముగ్గురి మృతి
- ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ ఆరా
- ఘటనాస్థలికి హోం మంత్రి షా
- ఆస్పత్రిలో క్షతగాత్రులకు పరామర్శ
- ఉగ్రకుట్ర కోణంలోనూ ఎన్ఐఏ దర్యాప్తు
- కారు కదలికలపై వివరాల కోసం సీసీటీవీ కెమెరాల జల్లెడ

న్యూఢిల్లీ, (నేటి ఫోకస్‌న్యూస్)-నవంబరు 10:

"అంత పెద్ద భారీ పేలుడు శబ్దాన్ని మా జీవితంలో ఎప్పుడూ వినలేదు" అని ఘటనాస్థలికి సమీపంలో ఉన్న ప్రత్యక్ష సాక్షులు పలువురు తెలిపారు. "పేలుడు జరిగిన సమయంలో నేను నా దుకాణంలో ఉన్నాను. పేలుడు ధాటికి నా కుర్చీలోంచి కింద పడిపోయాను. వెంటనే లేచి బయటకు పరుగెత్తాను. చాలామంది ఆ సమయంలో తలోదిక్కుకూ పరుగులు తీయడం కనిపించింది"
- ఓ దుకాణదారుడు.


"నేను మా ఇంటి టెర్రస్ మీద ఉండగా.. పెద్ద పేలుడు శబ్దం వినిపించింది. చూస్తే దూరంగా అగ్ని జ్వాలలు. పేలుడు ధాటికి భవనాల కిటికీలు కదిలిపోయాయి"
- ప్రత్యక్ష సాక్షి.

దేశ రాజధాని ఢిల్లీ.. భారీ పేలుడుతో దద్దరిల్లింది! దేశంలోని అత్యంత హై ప్రొఫైల్ ప్రాంతాల్లో ఒకటి.. పంద్రాగస్టునాడు దేశ ప్రధాని జాతినుద్దేశించి ప్రసంగించే ఎర్రకోటకు సమీపంలో మెట్రోస్టేషన్ వద్ద సోమవారం సాయంత్రం దాదాపు 7 గంటల సమయంలో కారు పేలి 9 మంది మరణించగా.. 24 మంది తీవ్రంగా గాయపడ్డారు! క్షతగాత్రులను హుటాహుటిన ఎల్ఎన్‌జేపీ ఆస్పత్రికి తరలించారు. మృతుల సంఖ్య పెరిగే ప్రమాదం ఉందని.. గాయపడ్డవారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందని సమాచారం. ఢిల్లీకి కేవలం 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న హరియాణాలోని ఫరీదాబాద్‌లో 2900 కిలోల బాంబు తయారీ పదార్థాలను పట్టుకున్న రోజునే.. అదీ హరియాణా రిజిస్ట్రేషన్ నంబర్‌తో ఉన్న కారులో పేలుడు జరగడంతో.. దీని వెనుక ఉగ్రకుట్ర ఏమైనా ఉందా అనే కోణంలో పోలీసులు, ఇతర కేంద్ర సంస్థల సిబ్బంది దర్యాప్తు చేస్తున్నారు. కాగా.. పేలుడు తీవ్రతకు ఘటనాస్థలి వద్ద భీతావహ దృశ్యాలు కనిపించాయి. మృతదేహాలు ఛిద్రమై శరీర భాగాలు చెల్లాచెదురుగా రోడ్డుపైన, పక్కనే ఉన్న వాహనాలపైనా పడ్డాయి. పేలుడు ధాటికి.. చుట్టూ ఉన్న వాహనాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఆరు కార్లు, రెండు ఈ-రిక్షాలు, ఒక ఆటో అగ్నికి ఆహుతైపోయాయి. మొత్తం 22 కార్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఘటనాస్థలికి సమీపంలోని పలు దుకాణాలు ధ్వంసమయ్యాయి. భవనాలు కంపించాయి. ఈ పేలుడు జరిగిన మూడు నిమిషాలకే అగ్నిమాపక శాఖకు ఫోన్ కాల్ వెళ్లింది. వెంటనే ఏడు మిగతా 2లో..

## భారీ ఉగ్ర కుట్ర భగ్నం

- ముగ్గురిని అరెస్టు చేసిన గుజరాత్ ఏటీఎస్
- ఒకరు హైదరాబాద్ డాక్టర్, ఇద్దరు యూపీ వాసులు
- ఆయుధాలు, రసాయనాల స్వాధీనం
- పలు నగరాల్లో ఉగ్రదాడులకు కుట్ర
- ఢిల్లీ, లఖ్‌నవూ, అహ్మదాబాద్‌ల్లో రెక్కీ

2




నేడే జూబ్లీ ఫైట్..

# పోలింగ్‌కు వేళాయె..

- పోలింగ్ కేంద్రాలకు తరలిన ఈవీఎంలు
- ఉదయం 7 గంటల నుంచే పోలింగ్ ప్రారంభం
- తొలిసారి పోలింగ్ కేంద్రాల్లో డ్రోన్ల ద్వారా పర్యవేక్షణ

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-నవంబర్ 10:

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పోలింగ్ కోసం అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. మంగళవారం ఉదయం 7 గంటల నుంచే పోలింగ్ ప్రారంభం కానుండడంతో సోమవారం సాయంత్రమే ఈవీఎం, వీవీప్యాట్‌లను సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు తరలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద జీహెచ్ఎంసి సిబ్బంది పారిశుధ్య పనులు పూర్తి చేశారు. ఓటర్లకు కల్పించే వసతులను ఉన్నతాధికారులు పరిశీలించారు. రెండు ప్రాంతాల్లో బాత్‌రూంలు సరిగ్గా లేకపోవడంతో వెంటనే మరమ్మతులు చేయించారు. పోలింగ్ కేంద్రాలకు వంద మీటర్ల దూరం వరకు సున్నపు గీతలు పెట్టారు. యూసఫగూడ కోట్ల విజయభాస్కర్‌రెడ్డిలోని డీఆర్‌సీ సెంటర్ నుంచి బీఎల్‌ఓలు ఇతర సిబ్బందికి ఈవీఎం, వీవీప్యాట్‌లను రిటర్నింగ్ అధికారి అందచేశారు. మిగతా 2లో..






2

# బిహార్‌లో నేడే తుది పోరు

# జూబ్లీహిల్స్ మనదే!




- అయినా ఈ ఒక్కరోజు అప్రమత్తంగా ఉందాం
- ఓటింగ్ శాతం పెరిగేలా చూడండి
- పోలింగ్ అయ్యేదాకా అందుబాటులో ఉండండి
- మంత్రులతో బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్‌లో సీఎం

2



# ఢిల్లీలో భారీ పేలుడు

(మొదటి పేజీ తరువాయి)



యూనిట్ల అగ్నిమాపక సిబ్బంది 20 ఫైరింజన్లతో అక్కడికి చేరుకుని మంటలార్పేందుకు రంగంలోకి దిగి.. 7.29 గంటలకల్లా.. అంటే పేలుడు జరిగిన 40 నిమిషాల్లోనే మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ పేలుడుకు సంబంధించిన ప్రాథమిక సమాచారాన్ని ఢిల్లీ పోలీసు కమిషనర్ సతీశ్ గోల్చా వెల్లడించారు. ''సాయంత్రం 6.52 గంటలకు.. రెడ్‌ఫోర్ట్ మెట్రోస్టేషన్ గేట్ నంబర్ 1 వద్ద ట్రాఫిక్ రెడ్ సిగ్నల్ పడడంతో నిదానంగా వచ్చిన ఒక కారు అక్కడ ఆగీ ఆగగానే పేలిపోయింది. ఆ సమయంలో ఆ కారులో ప్రయాణికులున్నారు. పేలుడు ధాటికి దాని చుట్టుపక్కలున్న వాహనాలు కూడా తీవ్రంగా దెబ్బతిన్నాయి'' అని ఆయన తెలిపారు. వెంటనే అప్రమత్తమైన పోలీసు బలగాలతోపాటు.. జాతీయ దర్యాప్తు సంస్థ, ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్, సీఆర్పీఎఫ్, నేషనల్ సెక్యూరిటీ గార్డ్ సహా పలు ఏజెన్సీల అధికారులు అక్కడికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించినట్టు వివరించారు. పరిస్థితిని అనుక్షణం పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు సమాచారాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు తెలుపుతున్నట్టు వెల్లడించారు. పేలిపోయిన కారులో ముగ్గురు ఉన్నట్టు మరో సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. ''పేలుడు జరిగిన చోట ఎలాంటి గుంతా పడలేదు. పేలుడు ధాటికి గాయపడ్డవారి శరీరాల్లో ఎలాంటి పెల్లెట్లూ కనిపించలేదు. బాంబు పేలుడు అయితే ఇలా జరగడం అసాధారణం. దీనిపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నాం'' అని ఆయన వివరించారు. అందులో భాగంగా.. ఆ కారు ఏయే ప్రాంతాల్లో తిరిగిందో తెలుసుకోవడానికి నగరంలోని అన్ని సీసీటీవీ కెమెరాలనూ జల్లెడపడుతున్నారు. పేలుడుకు ముందు ఏదైనా అనుమానాస్పదంగా కనిపించిందా? అని స్థానికులను, ప్రత్యక్షసాక్షులను ప్రశ్నిస్తున్నారు. ఆ ప్రాంతంలో పేలుడుకు ముందు నమోదైన ఫోన్‌కాల్స్ డేటాను విశ్లేషిస్తున్నారు. ఈ పేలుడులో గాయపడ్డవారి కుటుంబసభ్యులు, బంధువులు.. విషయం తెలియగానే ఎల్ఎన్‌జేపీ ఆస్పత్రికి చేరుకుని తమవారి కోసం ఆందోళనతో ఆరా తీశారు. గాయపడ్డ తమవారిని చూడ్డానికి ఆస్పత్రి సిబ్బంది తమను అనుమతించట్లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా, పేలిన కారు కదలికల కోసం సీసీటీవీ కెమెరాలను జల్లెడ పట్టిన పోలీసులు.. ఆ కారు దరియాగంజ్ మార్కెట్ నుంచి బయల్దేరి సాయంత్రం 4 గంటల సమయానికి సునెహ్రీ మసీదు పార్కింగ్ ఏరియా వద్దకు చేరుకున్నట్టు గుర్తించారు. అనంతరం ఆ కారు మళ్లీ ఛత్తా రైల్‌చౌక్ వద్ద యూటర్న్ తీసుకుని.. లోయర్ సుభాష్ మార్గ్ దిశగా వెళ్తున్న దృశ్యాలను గుర్తించారు. అక్కడ ఆ కారు సిగ్నల్ వద్దకు చేరుకుంటూ నెమ్మదించిందని.. అప్పుడు పేలుడు జరిగిందని ఓ అధికారి తెలిపారు. పేలుడు దెబ్బకు కారులో ఉన్న ముగ్గురూ ఛిద్రమైపోయారని తెలిపారు.

**పేలుడుకు కారణం ఇప్పుడే చెప్పలేం..**

పేలుడు ఘటనపై కేంద్రం హోంమంత్రి అమిత్ షా ఢిల్లీ పోలీసు కమిషనర్‌తో, ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టర్, ఎన్ఐఏ చీఫ్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. పేలుడు ఘటనపై అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పేలుడుకు కారణం ఏంటి అనేది ఇప్పుడే చెప్పలేమన్నారు. అనంతరం ఆయన ఎల్ఎన్‌జేపీ ఆస్పత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. అక్కణ్నుంచీ నేరుగా ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఇక.. సోమవారం రాత్రి 12 గంటల సమయానికి.. మృతుల్లో.. అశోక్, అమర్ అనే ఇద్దరిని మాత్రమే పోలీసులు గుర్తించారు. మిగతా మృతదేహాలు ఎవరివో ఇంకా గుర్తించాల్సి ఉంది. ఈ పేలుడు తమ పనేనని ఇంతవరకూ ఏ ఉగ్రసంస్థా ప్రకటించలేదు.

## భారీ ఉగ్ర కుట్ర భగ్నం

- ముగ్గురిని అరెస్టు చేసిన గుజరాత్ ఏటీఎస్
- ఒకరు హైదరాబాద్ డాక్టర్, ఇద్దరు యూపీ వాసులు
- ఆయుధాలు, రసాయనాల స్వాధీనం
- పలునగరాల్లో ఉగ్రదాడులకు కుట్ర
- ఢిల్లీ, లఖ్‌నవూ, అహ్మదాబాద్‌ల్లో రెక్కీ

హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్)-నవంబరు 9:



దేశ వ్యాప్తంగా పలు నగరాల్లో ఉగ్ర దాడులకు పన్నిన కుట్రను గుజరాత్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్(ఏటీఎస్) అధికారులు భగ్నం చేశారు. ఈ క్రమంలో హైదరాబాద్‌కు చెందిన ఒక డాక్టర్‌తోపాటు ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఇద్దరిని అరెస్టు చేశారు. గుజరాత్ ఏటీఎస్ డీఐజీ సునీల్ జోషి ఆదివారం విలేకరులకు తెలిపిన సమాచారం ప్రకారం.. ప్రమాదకర రసాయనాలు, ఆధునిక ఆయుధాలతో భారీ ఉగ్రదాడికి కుట్ర చేస్తున్న హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ సయ్యద్ అహ్మద్ మొహియుద్దీన్(35), ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన అజాద్ సులేమాన్ షేక్, మహమ్మద్ సుహెయల్ మహమ్మద్ సలీమ్‌లను అరెస్టు చేశారు. మొహియుద్దీన్‌ను గుజరాత్‌లోని గాంధీనగర్‌లో ఈ నెల 7న రెండు గ్లోక్ పిస్టళ్లు, ఒక బెరెట్టా పిస్టల్, 30 లైవ్ కార్ట్రిడ్జ్‌లు, నాలుగు లీటర్ల కాస్టర్ ఆయిల్, రిసిన్ తయారీకి వాడే ముడి పదార్థాలు స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు. విచారణలో తాను గాంధీనగర్ జిల్లాలో మారుమూల ఉన్న కలాల్ ప్రాంతంలో ఈ ఆయుధాలను అందుకున్నట్లు అతడు వెల్లడించాడు. ఉగ్ర కార్యకలాపాలు చేపట్టేందుకే వీటిని సేకరిస్తున్నట్లు తెలిపాడు. ఆన్‌లైన్‌లో కన్సల్టెంట్ డాక్టర్‌గా పనిచేసే క్రమంలో ఉగ్రవాదులతో ఇతడికి పరిచయం ఏర్పడింది. స్టేట్ ఖొరాసన్ ప్రావిన్స్)కు చెందిన అబూ ఖదీజా(ఆఫ్ఘనిస్థాన్) ఇతడితో సంప్రదింపులు జరుపుతున్నాడని గుర్తించారు. ఖదీజాకు పాకిస్థాన్ ఉగ్రవాదులతో సంబంధాలు ఉన్నాయి. చైనాలో వైద్యవిద్య చదివిన మొహియుద్దీన్ దేశంలో భారీ ఉగ్రదాడులు జరిపేందుకు అత్యంత విషపూరితమైన రిసిన్‌ను తయారుచేసే పనిలో ఉన్నట్లు గుజరాత్ ఏటీఎస్ డీఐజీ చెప్పారు. అతడి ఫోన్‌లో సేకరించిన సమాచారం ఆధారంగా అతడికి ఆయుధాలు అందించిన యూపీకి చెందిన అజాద్ సులేమాన్ షేక్, మహమ్మద్ సుహెయల్ మహమ్మద్ సలీమ్‌లను గుజరాత్‌లోని బనస్కాంత జిల్లాలో అరెస్టు చేశారు. రాజస్థాన్‌లోని హనుమాన్‌గఢ్‌లో సేకరించిన ఆయుధాలను వీరు మొహియుద్దీన్‌కు అందించారు. పాకిస్థాన్‌లోని వీరి హ్యాండ్లర్ డ్రోన్ ద్వారా ఆ ఆయుధాలను పంపాడని డీఐజీ వెల్లడించారు. కాగా వీరు ఉగ్రదాడులు జరిపేందుకు లఖ్‌నవూ, ఢిల్లీ, అహ్మదాబాద్‌లలోని పలు రద్దీ ప్రాంతాల్లో రెక్కీ నిర్వహించారు. మొహియుద్దీన్ అరెస్టుతో నగరంలోని రాజేంద్రనగర్ సర్కిల్ ఫోర్ట్‌వ్యూ కాలనీవాసులు ఉలిక్కిపడ్డారు. ఇతడు నివాసం ఉంటున్నది ఈ కాలనీలోనే. ఉప్పర్‌పల్లి ఫోర్ట్‌వ్యూ కాలనీ రోడ్డు నెంబరు 9లోని ఆషాద్ మంజిల్ మొదటి అంతస్తులో ఇతడు నివాసం ఉంటున్నట్లు సమాచారం.

## హైదరాబాద్‌లో అలర్ట్

- అర్ధరాత్రి పాతబస్తీ సహా పలు పాంతాల్లో
- ఎక్కడికక్కడ విస్తృత తనిఖీలు

హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్)-నవంబర్ 10:

దేశ రాజధాని ఢిల్లీలో భారీ పేలుడు సంభవించిన నేపథ్యంలో హైదరాబాద్‌లో పోలీసులు అలర్ట్ అయ్యారు. కేంద్ర ప్రభుత్వం సైతం హై అలర్ట్ ప్రకటించడంతో.. పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎక్కడికక్కడ చెకింగ్స్ చేస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పాతబస్తీతో పాటు హైదరాబాద్‌లోని సమస్యాత్మక ప్రాంతాలపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. ఒక్క హైదరాబాద్‌లోనే కాదు.. దేశవ్యాప్తంగా ప్రధాన నగరాలన్నింటికీ హైఅలర్ట్ ప్రకటించింది కేంద్ర ప్రభుత్వం. దీంతో ఆయా నగరాల్లో సెక్యూరిటీని టైట్ చేశారు. ముంబై, చెన్నై, కోల్‌కతా, బెంగళూరు వంటి ప్రధాన నగరాల్లో భద్రతా బలగాలు అప్రమత్తం అయ్యాయి. అటు, ఉత్తర ప్రదేశ్‌లోనూ అప్రమత్తత ప్రకటించారు.

## ప్రముఖ కవి, వాగ్గేయకారుడు అందెశ్రీ కన్నుమూత

(మొదటి పేజీ తరువాయి)

పోలీసు గౌరవ వందనంతో అంత్యక్రియలు జరుగుతాయని, రంగారెడ్డి, మేడ్చల్- మల్కాజిగిరి జిల్లాల కలెక్టర్లతో సమన్వయం చేసుకుని ఏర్పాట్లు చేయించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది. దాంతో, ఆయన అంత్యక్రియలను మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్‌లోని ఔటర్ జంక్షన్‌లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకు అరెకరం వివాదాల్లేని ప్రభుత్వ స్థలాన్ని గుర్తించాలని ప్రభుత్వం ఆదేశించడంతో సోమవారం మధ్యాహ్నం నుంచి రెవెన్యూ అధికారులు అంకుషాపూర్, కొండాపూర్ పరిధిలో ప్రభుత్వ భూములను పరిశీలించారు. చివరకు, ఘట్‌కేసర్‌లోని ఔటర్ జంక్షన్ వద్ద ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం సమీప స్థలాన్ని ఎంపిక చేశారు. జిల్లా కలెక్టర్ మను చౌదరి స్థలాన్ని పరిశీలించి పనులు చేపట్టాలని ఆదేశించారు. అందెశ్రీ అంత్యక్రియలు మంగళవారం జరగనున్నాయి. తొలుత, లాలాపేటలోని ఆయన ఇంటి నుంచి అంతిమ యాత్ర ప్రారంభం కానుంది. ఘట్‌కేసర్ పరిధిలోని నగర్‌లో నిర్మాణంలో ఉన్న ఆయన ఇంటి వద్ద కొద్దిసేపు ఉంచుతారు. అక్కడి నుంచి ర్యాలీగా యంనంపేట్ చౌరస్తాలోని ఔటర్ జంక్షన్‌కు చేరుకుని అక్కడ అంత్యక్రియలు పూర్తి చేస్తారు. అందెశ్రీ అంత్యక్రియల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొననున్నారు. ఆయన పార్థివ దేహానికి సీఎం నివాళులర్పిస్తారు. ఆ స్థలాన్ని స్మృతి వనంగా తీర్చిదిద్దనున్నట్లు అధికారులు తెలిపారు.

**తరలివచ్చిన నాయకులు, ప్రముఖులు..**

అందెశ్రీ మరణ వార్తతో తెలంగాణ తీవ్ర దిగ్భ్రాంతికి గురైంది. మట్టి మనిషి, పల్లెపదాల భావోద్వేగి ఇకలేరన్న వార్త తెలుసుకుని సాహితీప్రియులు తీవ్ర ఆవేదనకు లోనయ్యారు. అందెశ్రీ ఆకస్మిక మృతితో ఆయన కుటుంబ సభ్యులు రోదిస్తున్న దృశ్యాలు అందరినీ కంటతడి పెట్టించాయి. అభిమానుల సందర్శనార్థం అధికారులు సోమవారం మధ్యాహ్నం లాలాపేట్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ స్టేడియంలో అందెశ్రీ పార్థివ దేహాన్ని ఉంచారు. పెద్దఎత్తున రాజకీయ నాయకులు, అభిమానులు, కవులు, రచయితలు, కళాకారులు తరలి వచ్చారు. అందెశ్రీ పార్థివ దేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. వారిలో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఎంపీలు మల్లు రవి, ఈటల రాజేందర్, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, రాష్ట్ర మంత్రులు దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరి, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు, తలసాని శ్రీనివాసయాదవ్, పద్మారావుగౌడ్, జగదీశ్ రెడ్డి, శ్రీనివాసగౌడ్, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, వెన్నెల గద్దర్, బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, ఎమ్మెల్యే మందుల సామేలు, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, కోదండరాం, కల్వకుంట్ల కవిత, సీతారాంనాయక్, వి.హనుమంతరావు, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన దాసరి, సీపీ సజ్జనార్, తదితరులు ఉన్నారు. అందెశ్రీ అందించిన సేవలను కొనియాడారు. అందెశ్రీతో తమకున్న వ్యక్తిగత అనుబంధాన్ని, పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుని కన్నీటి పర్యంతమయ్యారు.

**ఇంటి కల పూర్తిగా నెరవేరకుండానే..**

అందెశ్రీ తనకు సొంత స్థలం ఉండాలని భావించారు. తాను చనిపోతే అందులోనే పూడ్చిపెట్టాలని చెబుతుండేవారు. ఇందుకు తన సొంతూరులో స్థలం కొనుగోలుకు ఒప్పందం చేసుకున్నారు. కానీ, వివాదంతో అది సాధ్యపడలేదు. ఇందుకు ఆయన బాధ పడేవారని ఆయన సన్నిహితులు తెలిపారు. ఇక, ప్లాట్ కొనుగోలుకు కొద్ది కాలం కిందట ఆయన ఘట్‌కేసర్ పరిసరాల్లో తిరిగారు. పలువురు రియల్ ఎస్టేట్ ఏజెంట్లను సంప్రదించారు. రేటు విషయంలో వెనకడుగు వేశారు. ఇందులో భాగంగా నగర్ కాలనీలో తిరుగుతుండగా కొందరు ఉద్యమకారులు ఆయనను గుర్తుపట్టారు. వారు, అక్కడి రియల్టర్ల సహకారంతో 348 చదరపు గజాల ప్లాటు కొని 2023 మార్చిలో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. మునిసిపాలిటీ అనుమతితో నాలుగంతస్తుల భవనాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం స్లాబులు పూర్తయి గోడల వరకు వచ్చింది.

## అందెశ్రీ మరణంపై యశస్విని రెడ్డి, ఝాన్సిరెడ్డి దిగ్భ్రాంతి

పాలకుర్తి, నవంబర్ 10-(నేటి ఫోకస్‌న్యూస్):

ప్రముఖ గేయ రచయిత, తెలంగాణ రాష్ట్ర గీతం సృష్టికర్త అందెశ్రీ మృతిపై పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సి రాజేందర్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తెలంగాణ స్ఫూర్తికి ప్రతీకగా నిలిచిన రాష్ట్ర గీతం జయ జయహే తెలంగాణ రచయిత, ప్రముఖ గేయకారుడు అందెశ్రీ మరణవార్త తెలిసి తాము తీవ్రంగా కలత చెందినట్టు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. తెలుగు సాహిత్యానికి, తెలంగాణ ఆత్మను ప్రతిబింబించిన గీత రచనలకు అందెశ్రీ చేసిన సేవలు చిరస్థాయిగా నిలుస్తాయని పేర్కొన్నారు. అందెశ్రీ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నట్టు తెలిపారు.

## నేటి నుంచి నల్లగొండలో జాగృతి జనం బాట

నల్లగొండ, నవంబర్ 10-(నేటి ఫోకస్‌న్యూస్):

నల్లగొండ జిల్లాలో నేటి నుంచి జాగృతి జనం బాటను తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రారంభించనున్నారు. ఇందులో భాగంగా తొలిరోజు మంగళవారం ఉదయం 9 గంటలకు మునుగోడు నియోజకవర్గంలోని కిష్టారంపల్లి ప్రాజెక్టును జాగృతి నేతలతో కలిసి సందర్శిస్తారు. లక్ష్మన్నపురంలో ముంపు బాధిత రైతులతో సమావేశం కానున్నారు. 11.30 గంటలకు దేవరకొండ కొమ్మపల్లి గురుకుల పాఠశాలను సందర్శిస్తారు. మధ్యాహ్నం 1గంటకు నక్కలగండి ప్రాజెక్టును సందర్శించి ముంపు బాధితులతో సమావేశమవుతారు. 3 గంటలకు నాగార్జున సాగర్ నియోజకవర్గంలో వరద తాకిడికి కూలిపోయిన సుంకిశాల రిటైనింగ్ వాల్‌ను పరిశీలిస్తారు. 4 గంటలకు నాగార్జున సాగర్ నియోజకవర్గంలోని నెల్లికల్ ప్రాజెక్టు (లిఫ్ట్ ఇరిగేషన్)ను పరిశీలిస్తారు. సాయంత్రం 6 గంటలకు మిర్యాలగూడ పట్టణంలో జాగృతిలో పలువురు చేరనుండగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించనున్నారు.

## బిహార్‌లో నేడే తుది పోరు

- 122 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్
- 3.7 కోట్ల మంది ఓటర్ల చేతిలో 1,302 మంది అభ్యర్థుల భవిత
- 1.75 కోట్ల మంది మహిళా ఓటర్లు
- నవయువ ఓటర్లు 7.69 లక్షలు
- బరిలో పలువురు మంత్రులు
- ఈ నెల 14న ఓట్ల లెక్కింపు ఫలితాల వెల్లడి

పట్నా, (నేటి ఫోకస్‌న్యూస్)-నవంబర్ 10:



బిహార్ అసెంబ్లీ ఎన్నికలు చివరి అంకానికి చేరాయి. రెండోది, చివరి విడత ఎన్నికల్లో 122 స్థానాలకు మంగళవారం పోలింగ్ జరుగనుంది. వివిధ ప్రధాన పార్టీల నేతలు సహా 1,302 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. 3.75 కోట్ల మంది ఓటర్లు వీరి భవితవ్యాన్ని ఈవీఎంలతో నిక్షిప్తం చేయనున్నారు. వీరిలో 1.75 కోట్ల మంది మహిళలే. 18-19 ఏళ్ల వయసుగల నవయువ ఓటర్లు 7.69 లక్షల మంది. సజావుగా పోలింగ్ నిర్వహణకు ఎన్నికల కమిషన్ అన్ని ఏర్పాట్లూ చేసింది. 45,399 పోలింగ్ కేంద్రాలను సిద్ధంచేసింది. వీటిలో 40,073 కేంద్రాలు గ్రామీణ ప్రాంతంలో ఉన్నాయి. 8,491 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించారు. వీటిలో ఒక్క గయాజీలోనే 1,084 కేంద్రాలు ఉన్నాయి. వీటితోపాటు మొత్తం 122 స్థానాల్లోనూ భారీగా భద్రతాబలగాలను మోహరించారు. ఇప్పటికే 500 కంపెనీల కేంద్ర సాయుధ పోలీసు బలగాలు ముందస్తు ఎన్నికల విధుల్లో ఉండగా.. వీటితోపాటు మరో 500 కంపెనీల సాయుధ సిబ్బందికి పోలింగ్ బాధ్యతలు అప్పటించారు. వీరుగాక 60 వేల మంది బిహార్ పోలీసులు, 30 వేల బిహార్ సాయుధ పోలీసు సిబ్బంది, 20 వేల మంది హోంగార్డులు, శిక్షణలో ఉన్న మరో 19 వేల మంది కొత్త పోలీసులు, ఇతర రాష్ట్రాలకు చెందిన 2 వేల మంది సిబ్బందిని మోహరించారు. నవాదా జిల్లా హిసువా స్థానంలో అత్యధికంగా 3.67 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. లౌరియా, చంపటియా, రక్సౌల్, త్రివేణిగంజ్, సుగౌలీ, బణ్‌మన్‌ఖీ సీట్లలో 22 మంది చొప్పున అభ్యర్థులు బరిలో నిలిచారు. అసెంబ్లీలోని మొత్తం 243 స్థానాలకు గాను 121 స్థానాలకు ఈ నెల 6న జరిగిన మొదటి దశ ఎన్నికల్లో 65 శాతానికిపైగా పోలింగ్ నమోదైన సంగతి తెలిసిందే. రెండు దశల్లో కలిపి ఈ నెల 14న ఓట్లు లెక్కించి తుది ఫలితాలను ప్రకటిస్తారు.

**సీమాంచల్‌పైనే పార్టీల దృష్టి**

ఎన్నికలు జరిగే జిల్లాల్లో అత్యధికం పూర్వాంచల్ ప్రాంతంలోనే ఉన్నాయి. ఇది ముస్లిం ప్రాబల్య ప్రాంతం కావడంతో బీజేపీ-జేడీయూ నేతృత్వంలోని పాలక ఎన్డీఏ, విపక్ష ఇండీ కూటమి పార్టీలతో కూడిన మహాగర్‌బంధన్ ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. ముస్లిం ఓట్లు తనకేనని గర్‌బంధన్ భావిస్తుండగా.. చొరబాటుదార్లకు విపక్షం అండగా నిలుస్తోందని ఎన్డీఏ ఆరోపిస్తోంది. నితీశ్‌కుమార్ క్యాబినెట్‌లోని పలువురు మంత్రులు బ్రిజేంద్రప్రసాద్ యాదవ్ (సుపాల్), లేశీ సింగ్ (ధమ్‌దాహా), షీలా మండల్ (ఫుల్‌పరాస్), జమాఖాన్ (చైన్‌పూర్)-జేడీయూ.. ప్రేమ్‌కుమార్ (గయ), రేణుదేవి(బెతియా), నీరజ్‌కుమార్ సింగ్(ఛతర్‌పూర్), మాజీ ఉపముఖ్యమంత్రి తార్‌కిశోర్ ప్రసాద్ (కతిహార్)- బీజేపీ.. పీసీసీ అధ్యక్షుడు రాజేశ్‌కుమార్ (కుటుంబ), కాంగ్రెస్ శాసనసభాపక్ష నేత షకీల్ అహ్మద్ ఖాన్ (కడ్వా), సీపీఐఎంఎల్-లిబరేషన్ పక్ష నేత మెహబూబ్ ఆలం (బలరాంపూర్) బరిలో ఉన్నారు. కాగా, హెచ్ఏఎంకు కేటాయించిన ఆరు స్థానాలకు, ఆర్ఎల్ఎంకు ఇచ్చిన ఆరు స్థానాల్లో నాలుగింటికి రెండో దశలోనే పోలింగ్ జరుగుతోంది.

## పోలింగ్‌కు వేళాయె..

(మొదటి పేజీ తరువాయి)

నియోజక వర్గ వివరాలు...
మొత్తం ఓటర్లు 4,01,635
పురుషులు 2,08,561
మహిళలు 1,92,779
ఇతరులు 25
పోలింగ్ కేంద్రాలు 407
సిబ్బంది 2,060
సమస్యాత్మక కేంద్రాలు 226
పోలీస్ సిబ్బంది 2,000
రిజర్వ్‌తో కలుపుకొని 2,394
మొత్తం బ్యాలెట్ యూనిట్లు
కంట్రోల్ యూనిట్లు 561
వీవీ ప్యాట్ యంత్రాలు 595
ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు 58

## జూబ్లీహిల్స్ మనదే!

హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్)-నవంబరు 10:

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పోలింగ్ సమీపిస్తున్న కొద్దీ బీఆర్ఎస్ బలహీనపడిందని సీఎం రేవంత్‌రెడ్డి.. రాష్ట్ర మంత్రులతో అన్నారు. ప్రస్తుతం ఉన్న సమాచారం ప్రకారం కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్ విజయం ఖాయమని చెప్పారు. అయినా పోలింగ్ రోజు అప్రమత్తంగా ఉండాలని వారికి సూచించారు. ఆయా మంత్రులు తాము ఇన్‌చార్జులుగా ఉన్న డివిజన్ల నాయకులకు మంగళవారం మొత్తం అందుబాటులో ఉండాలని, ఏవైనా సమస్యలు తలెత్తితే పరిష్కరించాలని నిర్దేశించారు. సోమవారం ఉదయం అందుబాటులో ఉన్న మంత్రులతో తన నివాసంలో ముఖ్యమంత్రి బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్ నిర్వహించారు. ఉప ఎన్నికలో పార్టీ పరిస్థితిపై డివిజన్ల వారీగా సమీక్షించారు. పోలింగ్ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వారికి సూచించారు. ఉదయమే కాంగ్రెస్ కార్యకర్తలు, సానుభూతి పరులతో ఓట్లు వేయించడం పూర్తి చేయాలని, ఓటర్లను పోలింగ్ కేంద్రం వరకూ బాధ్యులు తీసుకువచ్చేలా చూసుకోవాలని అన్నారు. పోలింగ్ శాతం పెరిగితే కాంగ్రెస్ పార్టీ మెజారిటీ పెరుగుతుందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో మంత్రులతోపాటు పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ పాల్గొన్నారు.

## ఖమ్మం డీఈవోగా చైతన్య జైనీ

- విద్యాశాఖ కమిషనర్ నవీన్ నికోలస్ ఉత్తర్వులు జారీ
- ఖమ్మం డీఈవోగా చైతన్య జైనీ
- ఉత్తర్వులు జారీ చేసిన విద్యాశాఖ కమిషనర్

ఖమ్మం, నవంబర్ 10-(నేటి ఫోకస్‌న్యూస్):


ఖమ్మం జిల్లా విద్యాశాఖాధికారి (డీఈవో)గా చైతన్య జైనీ నియమితులయ్యారు. కరీంనగర్ డీఈవోగా పనిచేస్తూ సెలవుల్లో ఉన్న ఆమెను ఖమ్మం డీఈవోగా నియమిస్తూ విద్యాశాఖ కమిషనర్ నవీన్ నికోలస్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కరీంనగర్ డీఈవోగా నియమితులు కావడానికి ముందు మూడేళ్లపాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో స్పౌజ్ డిప్యూటేషన్‌పై పనిచేశారు. అంతకుముందు యాదాద్రి జిల్లా డీఈవోగానూ విధులు నిర్వర్తించారు. ఖమ్మంలో 2022లో డీఈవోగా పనిచేసిన యాదయ్య సెలవులో వెళ్లిన తర్వాత ఎవరూ రెగ్యులర్ డీఈవోలుగా నియమితులు కాలేదు. తర్వాత నియమితులైన సోమశేఖరశర్మ, సామినేని సత్యనారాయణలు డైట్ కళాశాల లెక్చరర్లు. వారినే ఇన్‌చార్జి డీఈవోలుగా ఉన్నతాధికారులు నియమించారు. తొలుత, సోమశేఖరశర్మ, తర్వాత సామినేని సత్యనారాయణలు ఇన్‌చార్జి డీఈవోలుగా కొనసాగారు. వరుసగా వారు కూడా ఒకరితర్వాత మరొకరు ఉద్యోగ విరమణ చేయడంతో ఈ ఏడాది ఆగస్టు నుంచి ఖమ్మం అదనపు కలెక్టర్ డాక్టర్ పీ.శ్రీజ ఖమ్మం డీఈవోగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇటీవల డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నిర్వహించిన విద్యాశాఖ సమీక్షలో ఖమ్మం కలెక్టర్ అనుదీప్.. విద్యాశాఖ కార్యదర్శితో చర్చించారు. ఖమ్మానికి రెగ్యులర్ డీఈవోను నియమించాలని కోరారు. ఈ నేపథ్యంలోనే చైతన్య జైనీని ఖమ్మం జిల్లాకు రెగ్యులర్ డీఈవోగా నియమించారు.

# తండ్రీకొడుకుల పోటాపోటీ పాటల డ్యాన్స్‌లు

## దుమ్మురేపుతున్న చిరు, చరణ్‌లు



ఒకప్పుడు హీరోల మధ్య పోటీ ఉండేది. ఒక హీరో చేసిన కథ, పాట,్ట÷ట్ హిట్టయితే అలాంటిదే తమ హీరో కూడా చేయాలని అభిమానులు కోరుకునేవారు. అందుకు తగ్గట్టే హీరోలు, దర్శకులు ఆయా సన్నివేశాలను డిజైన్ చేసుకునేవారు. ఇప్పుడు సొంతవారి నుంచే పోటీ ఎదురవుతోంది. అటు చిరంజీవి , ఇటు రామ్‌చరణ్ తమ కొత్త చిత్రాల్లోని పాటలతో సోషల్ మీడియాను ఊపేస్తున్నారు. పోటీ మాట ఎలా ఉన్నా, మెగా అభిమానులు మాత్రం ఆనందంలో తేలియాడుతున్నారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో చిరంజీవి కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'మన శంకరవరప్రసాద్ గారు' . నయనతార కథానాయిక. శరవేగంగా చిత్రీకరణ జరుపుకొంటున్న ఈ మూవీ సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. చిత్ర ప్రచారంలో భాగంగా విడుదల చేసిన 'మీసాల పిల్ల సాంగ్ యూత్‌ను విశేషంగా ఆకట్టుకుంటోంది. భీమ్స్ సిసిరోలియో సంగీతం, ఉదిత్ నారాయణ్ గాత్రానికి చిరంజీవి గ్రేస్ తోడవడంతో ఈ పాట ట్రెండ్ అవుతోంది. ఇప్పటికే 50 మిలియన్ వ్యూస్‌తో దూసుకుపోతోంది. సాంగ్‌ను ఎంజాయ్ చేస్తూ డ్యాన్స్ చేయడంలో చిరంజీవి ఆయనకు ఆయనే సాటి. తెరపై ఆ గ్రేస్ చిరులో మాత్రమే చూడగలం. తండ్రి బాటలోనే పయనిస్తూ అదరగొడుతున్నారు రామ్‌చరణ్. ఆయన కథానాయకుడి గా బుచ్చిబాబు దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'పెద్ది'. జాన్వీకపూర్ కథానాయిక. ఏఆర్ రెహమాన్ సంగీత దర్శకుడు. శరవేగంగా చిత్రీకరణ జరుపుకొంటున్న ఈ మూవీ నుంచి 'చికిరి.. చికిరి' అంటూ సాగే పాటను విడుదల చేశారు. ఇందులో చరణ్ వేసిన స్టెప్ సోషల్‌మీడియాను ఊపేస్తోంది. చిన్నా, పెద్దా వయసుతో సంబంధం లేకుండా దీన్ని రీక్రియేట్ చేసి, పంచుకుంటున్నారు. అతి తక్కువ సమయంలోనే ఈ పాట 50 మిలియన్ వ్యూస్‌ను సొంతం చేసుకోవడం గమనార్హం. వచ్చే ఏడాది మార్చి 27న 'పెద్ది ప్రేక్షకుల ముందుకురానుంది.






## మీ ఆతిథ్యం అదుర్స్.. ప్రభాస్‌కు ఇమాన్వీ కితాబు

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ఆతిథ్యం ఎలా ఉంటుందో అభిమానులు, మూవీ లవర్స్‌కు ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఇప్పటికే చాలా మంది సెలబ్రిటీలు ప్రభాస్ ఇంటి భోజనం ఎంత ప్రత్యేకమో పలు సందర్భాల్లో షేర్ చేసుకున్నారు. ప్రభాస్ ఆతిథ్యాన్ని స్వీకరించిన వారిలో తాజాగా అతడి కోస్టార్ ఇమాన్వీ కూడా చేరిపోయింది. ప్రభాస్, ఇమాన్వీ కాంబినేషన్‌లో ఫౌజీ సినిమా వస్తోన్న విషయం తెలిసిందే.

ఫౌజీ మూవీ షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో కొనసాగుతోంది. షూటింగ్ బ్రేక్ టైంలో ఇమాన్వీ ప్రభాస్ ఇంట్లో పసందైన భోజనాన్ని రుచి చూసింది. సర్‌ప్రైజింగ్‌గా, సంతోషంగా అనిపించింది.. మీ ఆతిథ్యానికి నా మనస్సు, పొట్ట నిండుగా మారిపోయాయి. ప్రభాస్ గారు మీ ఆతిథ్యానికి ధన్యవాదాలు.. అంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది ఇమాన్వీ. ఇప్పుడీ పోస్ట్ నెట్టింట వైరల్ అవుతోంది. హను రాఘవపూడి డైరెక్ట్ చేస్తున్న ఫౌజీ చిత్రంలో శాండల్ వుడ్ భామ, సింగర్ ఛైత్ర జే అచర్ కీలక పాత్రలో నటిస్తోంది. పీరియాడిక్ యాక్షన్ రొమాంటిక్ డ్రామా వస్తోన్న ఈ మూవీని మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. మిథున్ చక్రవర్తి, అనుపమ్ ఖేర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందిస్తున్నారు. మేకర్స్ ఈ చిత్రాన్ని 2026 ఆగస్టులో విడుదల చేసేందుకు ఎ÷-లాన్ చేస్తున్నారు. ప్రభాస్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైన్‌లో పెట్టాడని తెలిసిందే. మారుతి డైరెక్షన్‌లో రాజాసాబ్ చేస్తున్నాడు. దీంతోపాటు సలార్ 2, కల్కి 2, స్పిరిట్ చిత్రాలు ట్రాక్‌పై ఉన్నాయి.

## రాజాసాహెహెబ్‌పై పెరుగుతున్న అంచనాలు


పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా, దర్శకుడు మారుతి తెరకెక్కిస్తున్న హారర్-కామెడీ ది రాజా సాబ్ చిత్రం పై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ముఖ్యంగా ఈ సినిమా నుండి ఫస్ట్ సింగిల్

ఎప్పుడు వస్తుందన్న దానిపై అభిమానుల మధ్య పెద్ద చర్చ జరుగుతోంది. దీనిపై చివరికి నిర్మాత ఎస్‌కేఎన్ స్పందించి క్లారిటీ ఇచ్చారు. ఎస్‌కేఎన్ వెల్లడించిన వివరాల ప్రకారం, ఫస్ట్ సింగిల్ విడుదలలో ఆలస్యం రావడానికి కారణం ఉత్తర భారత, తెలుగు మార్కెటింగ్ టీమ్‌ల మధ్య చర్చలు అని చెప్పారు. మొదటగా 'రెబెల్ సాబ్' అనే ఎనర్జిటిక్ సాంగ్‌ను ముందుగా విడుదల చేయాలని అనుకున్నా, ఉత్తర భారత పంపిణీ దారులు మాత్రం ముందుగా మెలోడి సాంగ్ రిలీజ్ చేయాలని సూచించారని తెలిపారు. ఈ భిన్నాభి ప్రాయాల వల్లే చిన్న ఆలస్యం జరిగిందని అన్నారు. దక్షిణ భారత మార్కెట్లో సాధారణంగా లిరికల్ వీడియోలు మాత్రమే రిలీజ్ చేసి, పూర్తి సాంగ్ వీడియోలను థియేటర్స్‌లో చూపిస్తారని, కానీ ఉత్తర భారత మార్కెట్లో మాత్రం పూర్తి వీడియో సాంగ్స్ ముందుగానే విడుదల చేస్తారని ఎస్‌కేఎన్ వివరించారు. ఇందుకే ఆలస్యం జరిగుతుందని తెలియజేశారు. 'ది రాజా సాబ్'లో ఐటెమ్ సాంగ్ ఉండదని, అయితే ఒక పాపులర్ హిందీ సాంగ్‌ను రీమిక్స్ వెర్షన్‌గా తీస్తున్నామని నిర్మాత తెలిపారు. ప్రతి సాంగ్ రిలీజ్ మధ్య 10-14 రోజుల గ్యాప్ ఇస్తారని, ఇలా చేయడం వల్ల ప్రేక్షకులు ప్రతి సాంగ్‌ను మంచి మ్యూజిక్ అనుభవంతో ఆస్వాదించగలరని చెప్పారు. ఎస్‌కేఎన్ ప్రకారం, ఫస్ట్ సింగిల్ నవంబర్ మూడో లేదా నాలుగో వారంలో విడుదల కానుంది. ఆ తర్వాత సినిమా ప్రమోషన్లు డిసెంబర్ చివరి వరకు కొనసాగుతాయి. ఈ క్రమంలో 'ది రాజా సాబ్' నువచ్చే జనవరి 9న, సంక్రాంతి సీజన్‌లో గ్రాండ్‌గా రిలీజ్ చేయడానికి టీమ్ సన్నాహాలు చేస్తోంది. మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రానికి థమన్ సంగీతం అందిస్తున్నారు. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. మొత్తానికి, 'ది రాజా సాబ్' ఫస్ట్ సింగిల్‌పై ఉన్న ఆసక్తి మరింత పెరిగింది. నిర్మాత ఎస్‌కేఎన్ ఇచ్చిన తాజా అప్‌డేట్‌తో అభిమానులు ఊరట చెందారు. మెలోడి సాంగ్ రూపంలో రాబోయే ఈ ఫస్ట్ సింగిల్, ప్రభాస్ మ్యూజిక్ జర్నీకి కొత్త ఛాప్టర్‌గా నిలిచే అవకాశముంది.






## రవితేజ కొత్త సినిమా పోస్టర్ ఔట్



మాస్ మహారాజా రవితేజ, కిషోర్ తిరుమల దర్శకత్వంలో ఆర్76 తెరకెక్కుతున్నసంగతి తెలిసిందే. సుధాకర్ చెరుకూరి భారీగా ఈ సినిమాను ప్లాన్ చేసారు. ఇందులో రవితేజ సరసన ఆషికా రంగనాథ్ కథానాయికగా నటిస్తోంది. ఈ సినిమాకి 'భర్త మహాశయు లారా' టైటిల్ అనుకుంటున్నట్లు సోషల్ మీడియాలో వార్తలు వైరల్ అవుతున్నాయి. అయితే సోమవారం ఈ సినిమా టైటిల్ విడుదల చేయడానికి టైం ఫిక్స్ చేశారు మేకర్స్. ఈ లోపే టైటిల్ సగం చెప్పి చెప్పకుండా పోస్టర్స్ లీక్ చేసారు. టైటిల్ చూస్తే.. మొత్తానికి 'భర్త మహాశయులారా' టైటిల్నే ఫైనల్ చేసినట్లు తెలుస్తోంది. తాజాగా ఓ పాట కోసం ప్రత్యేకమైన సెట్ వేశారు. శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీలో రూపొందుతున్న అదిరిపోయే డ్యాన్స్ నంబర్ చిత్రీకరిస్తున్నారు. ఎమోషనల్ కథలతో అలరించే దర్శకుడు కిశోర్ తిరుమల ఈ చిత్రాన్ని అన్ని వర్గాల ప్రేక్షకుల ఆకట్టుకునేలా రూపొందిస్తున్నారు. ఈ సినిమాకి సెన్సేషనల్ కంపోజర్ భీమ్స్ సిసిరోలియో మ్యూజిక్ అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ ప్రసాద్ మూరెళ్ళ. నేషనల్ అవార్డు గ్రహీత శ్రీకర్ ప్రసాద్ ఎడిటర్. ఏఎస్ ప్రకాష్ ఆర్ట్ డైరెక్టర్.

## ప్రేమంటే మూవీ నుంచి పెళ్లి షురూ పాట విడుదల

ప్రియదర్శి, ఆనంది జంటగా తెరకెక్కిన చిత్రం 'ప్రేమంటే' శ్రీ వేంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పీ బేనర్‌పై పుస్కూర్ రామ్‌మోహన్ రావు, జాన్వీ నారంగ్ నిర్మించారు. రానా దగ్గుబాటి సమర్పిస్తున్నారు. ఈనెల 21న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఈ చిత్రం నుంచి పెళ్లి పాట 'పెళ్లి షురూ'ను హీరోయిన్ శ్రీలీల చేతుల మీదుగా విడుదల చేశారు. వివాహ వేడుకల ఉత్సాహాన్ని, సంబరాన్ని తెలిపేలా ఉన్న ఈ పాటను శ్రీమణి రాశారు. దీపక్ బ్లూ, శ్రేయా ఘోషల్ ఆలపించగా, లియోన్ జేమ్స్ సంగీతం అందించారు. ఈ పాట నూతన జంట భావోద్వేగాలను అందంగా ఆవిష్కరిస్తుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి ఎడిటర్: రాఘవేంద్ర తిరుణ్, సినిమాటోగ్రఫీ: విశ్వనాథ్ రెడ్డి.

